# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 137వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలకు డ్రోన్లు వినియోగించడం విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేలా పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు.**

4. **రాబోయే 20 ఏళ్ళ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 137వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

సాంకేతికత ప్రజల జీవితాలను మార్చినప్పుడే దానికి సార్థకత ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉన్న మారుమూల ప్రాంతాల నుంచి డ్రోన్ల ద్వారా రక్త నమూనాలు సేకరించడం, అత్యవసర మందులను వేగంగా చేరవేయడం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు, వైద్య సామగ్రిని డ్రోన్ల ద్వారా తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టును ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, వైద్య విభాగాలతో అనుసంధానించి సమర్థంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. డ్రోన్ ఆధారిత వైద్య సేవలను మరింత వ్యవస్థీకృతం చేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేలా పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం హైదరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని నిన్న కలిసి 'చిన్న నీటిపారుదల వ్యవస్థ'పై నివేదిక అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా వ్యవసాయ విధానాలను రూపొందించాలని, సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులను సంఘటితం చేసి మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులకు మెరుగైన అవకాశాలు కల్పించేలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

---------------------------

రాబోయే 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకోని ఆంధ్రపదేశ్‌లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగరంలో 48 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నాలుగున్నర కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అభివృద్ధి పనులను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇన్నర్ రింగ్ రోడ్డుతో పల్నాడు జిల్లాకు అమరావతితో అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొంటూ...

వాయిస్... 29 సెకన్లు

---------------------------

గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి ఫలితంగానే వ్యావహారిక భాషా ఉద్యమం రూపుదిద్దుకుందని తెలిపారు. విజయవాడ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం వేడుకలు నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు' అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వ్యవహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు.

---------------------------

నీట్ పీజీ పరీక్ష ఈ రోజు నిర్వహిస్తున్నారు. ఇందుకు జాతీయ వైద్య పరీక్షల బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. ఒకే షిఫ్ట్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో జరగనున్న ఈ పరీక్షకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఉదయం 7 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాల్లోని 76 కేంద్రాల్లో 18 వేల 700 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

నంద్యాల జిల్లా బనగానపల్లె పరిధిలో తాగునీటి అవసరాల కోసం అవుకు రిజర్వాయర్‌కు శ్రీశైలం కుడి

కాల్వ ద్వారా వారం రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈరోజు సాయంత్రం నుంచి వారం రోజుల పాటు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకే విడుదల చేస్తున్నామని, రైతులు ఎవరూ పంటలు వేయవద్దని మంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

అభివృద్ధి పనులకు ఆమోదం లభించిన నాలుగు నెలల్లోగా పనులు ప్రారంభం కాకపోతే పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపి లాండ్స్) నిధులను ఇతర పనులకు తక్షణమే మళ్లించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం నిధుల వినియోగంపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ సంస్థలకు నిర్దిష్ట కాలపరిమితిని విధించి పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జల జీవన్ మిషన్ పనుల పురోగతిపై ప్రతి రెండు వారాలకు ఒకసారి స్థానిక శాసన సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల వేగాన్ని పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ -ఎయిమ్స్ క్రీడా సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు అహంతేం శాంతా సింగ్ నిన్న ప్రారంభించారు. ఈ కేంద్రంలో పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా వ్యాయామశాలలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అహంతేం శాంతా సింగ్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనశైలికి, శారీరక, మానసిక దృఢత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఉత్సాహభరితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా పురుషుల డబుల్స్, మహిళల సింగిల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లను ఆయన ప్రారంభించారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్- ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలపై అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి విస్తరించి ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================